

త్రామరలా సత్యప్రియకు సినిమా పిచ్చి ఎలా అంటుకుందో తెలియదు. ఆమె కుటుంబంలో అటూ ఇటూ ఎన్ని తరాలు గాలించినా 'కళకు' సంబంధించిన వాసన వున్న వాళ్ళే లేరు. డబ్బు సంపాదించటం అన్న ఒకే ఒక్క-కళను ఆ ఇంట అందరూ చిన్నప్పుడే అభ్యసించి పెద్దయ్యాక 'మాస్టర్' డిగ్రీలు పుచ్చుకొంటుంటారు.

సత్యప్రియకు కూడా పాపం

సినిమాస్టార్ నవుదామన్న ఆరాటం, దుగ్గలు లేవు. సినిమా అన్నా, సినిమా జీవులన్నా, ఆ వాతావరణ మన్నా వెర్రి వ్యామోహం, భ్రమ. అంతే!

వచ్చిన సినిమానల్లా బీరు పోకుండా చూస్తుంది. ఏ సినిమా చెత్తో, ఏ సినిమా బెస్టో తేల్చు కోవడం కోసం ప్రతి సినిమాను-మొదటి రోజు, మొదటి ఆటకు, మొట్టమొదటి టిక్కెట్ రిజర్వే షన్ చేయించుకొని చూస్తుంది. అలా ఆమె సినిమా పరిశ్రమకు మహారాజ పోషకురాలు.

నటీనటులను పాత్రల పేర్లతో కాకుండా, నిజ నామాలతో పిలుస్తూ సినిమా కథలు చెప్పటం, మంచి చెడ్డల్ని గురించి లెక్చర్లివ్వటం-ఆమెకున్న గొప్ప హాబీ.

'వాడు....వాడు ఎంత బాగా నటించాడనుకున్నావ్! అబ్బ!....'

'అది....ఆ కేరెక్టర్‌కి సూట్ కాదనుకో. అయినా ఆ ఘట్టంలో హీరోగాడిని ఊపేసింది కదూ?'

ఇదీ ఆమె ధోరణి. ఏక వచ నాల్లో నటీనటులను పిలిచేటంత గొప్ప అభిమానం ఆమెకు. ఎక్‌స్ట్రాల పేర్లనుంచి ఆమెకు కంఠోపాఠం. ప్రముఖుల జీవిత ఘట్టాలు స్టేటిస్టిక్స్‌తో సహా చెప్పేయ గలదు. చిరునామాలు సరేసరి!

"సత్యా! ఎందుకే నీకీ బాధ? హాయిగా నువ్వే సినిమా స్టారువు కారాదూ? నీకేం తక్కువ?"

తక్కువేం లేదు. అందం వుంది. మేకప్- సినిమాస్టారుల్లా చేస్తుంది. వాళ్ళ స్టయిల్స్ అనుక రిస్తుంది. వెళ్ళి సంగీతం నేర్చు కుంది. కాస్తంత డాన్సు వచ్చు. తండ్రికి పెట్టుబడి పెట్టే స్తోమత వుంది. అయినా ఆ ఇచ్ఛ ఆమె కుంటేనా?

కాగా ఆమెకు సినిమా హీరో లాంటి వాడిని పెళ్ళి చేసుకోవాలని మాత్రం వుంది. అంచేత పెళ్ళి సంగతి పెద్దలు అనగానే సరే నంది.

పెళ్ళి చూపులకు చాలా మంది వచ్చారు. అందరికీ సత్యప్రియ నచ్చింది. అయితే ఆమె కళ్ళకు సినిమా హీరోల్లా ఎవరూ అన లేదు.

చివరికి శరత్‌బాబులో ఆ ధోరణి, పోలికలు కన్పించాయి ఆమెకు. పెళ్ళి చూపుల్లో లాంఛ నంగా అతడేమో అడిగేడు. ఆ అవకాశాన్ని దొరకబుచ్చుకొని ఆమె అతడిని సీరియస్‌గా ఇంటర్వ్యూ చేసింది.

"మీరు నెలకెన్ని సినిమాలు చూస్తారు?"

"మీకు నచ్చిన హీరోయిన్‌ల పేర్లు చెప్పగలరా?"

సూటిగా క్లుప్తంగా సమాధానా లిచ్చాడు శరత్‌బాబు. ఇస్తూ ఆమె సైకాలజీ స్టడీ చేశాడు.

"మీకు నే నెందుకు నచ్చాను?"

"మీరు సినిమా హీరోయిన్‌లా వుంటారు కనుక!"

సూపర్‌స్టార్ భుజం తట్టి నంతగా సంతోషించింది సత్య ప్రియ.

"హీరో ఎవరు మరి?"

"ఇంకెవరు-నేనే."

సత్యప్రియ,శరత్‌బాబుల పెళ్ళి అయింది. ఆ తర్వాత కొన్నాళ్ళకే సత్యప్రియ కాస్తా- 'సత్యప్రియ బి.ఎస్‌సి.' అయింది.

* * *

స్వయంకృషితో పైకి వచ్చిన వాడు శరత్‌బాబు. హైదరాబాద్‌లో లెక్చరర్ ఉద్యోగం. ఈ మధ్యే రీసెర్చి చేసి డాక్టరేట్ పుచ్చు కున్నాడు.

అతనికి చిన్నప్పటి నుంచి నాటకాలన్నా, సాహిత్యమన్నా అభిరుచి. నటుడు—రచయిత. పుస్తకాలతోపాటు జీవితాన్ని కూడా చదివి ఉత్తమాభిరుచుల్ని, సంస్కా రాన్ని పెంచుకొన్నాడు.

అతను పెళ్ళి చూపుల్లో- చూడ గానే సత్యప్రియను ప్రేమించాడు. ఆమెకు సినిమాల పిచ్చి అని అంతకు ముందే విన్నాడు. ఆమె అడిగిన ప్రశ్నలలోనూ అదే తేలి పోయింది.

'ఈ రోజుల్లో సినిమా పిచ్చి లేని స్త్రీ లెవరు?' అని అనుకొని సరిపెట్టుకున్నాడు. కానీ సత్య ప్రియ వెనుకనున్న సంపదను అతను ఏనాడూ ఆశించలేదు.

అయితే పెళ్ళయ్యాక సత్య ప్రియ సినిమా పిచ్చి సాధారణ మైందికాదని తేలిపోయిందతనికి.

అతనికి సినిమాలంటే విము ఖత్వం లేదు. అయినా భార్య కోసం రోజుకో సినిమా చొప్పున మంచి చెడులన్న భేదం లేకుండా చూడటం అతనికి చాలా కష్టమే అయింది. ఆమెలో ఉత్తమాభి రుచులు కలిగించాలని అతను చేసిన ప్రయత్నాలన్నీ విఫల మయ్యాయి.

పైగా- "సినిమా చూడటాని క్కూడా కళా హృదయం వుండా లండీ" అంటూ వో చురక అతనికే అంటించింది.

అతను ఆమెతో సినిమాలకు వెళ్ళటం తగ్గించాడు. అందుకు

ఆమె అంతగా విచారించ లేదు. అయితే సినిమా చూచి వచ్చి, ఆమె అందులో నటించిన నటీనటులను గురించి వర్ణించి చెప్పటం అతనికి తల నొప్పిగానే వుండేది.

కానీ వస్తుతః అతను సాత్వికుడు, సంస్కారి అంచేత తల నొప్పి నన్నా భరించాడు కాని, ఆమెకు కష్టం కలిగించే మాట అనలేదు.

"ఏమండీ! ఆ సినిమా చూశారా? అందులో విలన్ పాత్రను కొత్తతను వేసేడు. అతను ఎవరనుకొన్నారు? నన్ను పెళ్ళి చేసుకోవాలని పెళ్ళి చూపులకు వచ్చిన ఆరో వాడండీ! ఎంత బాగా చేసేడనుకొన్నారు! సందేహం లేదు—పైకొస్తాడు. అప్పుడే ఎనిమిది 'బుకింగ్'లు వచ్చాయట! పెళ్ళి చూపుల్లో చూపినప్పుడు అతను నటుడవుతాడనే అనుకోలేదండీ! ఎంత పిచ్చిదాన్ని! సినిమా చూడకముందే అతని బొమ్మను పత్రికల్లో చూచినప్పుడే అనుమానం వేసింది. కాని, అతను కాదనుకున్నాను. తీరాచూస్తే అతనే, చిత్రంగా లేదూ?" వో రోజు సినిమా చూసొచ్చి కొత్త పాట ప్రారంభించింది.

ఆ తర్వాత యింటి కొచ్చిన ప్రతివాళ్ళ ముందూ అదే రికార్డు వేయసాగింది. శరత్‌బాబుకు కించిత్తు కోపం రాక తప్పలేదు.

"సత్యా! అలా పరాయి వాళ్ళ దగ్గర మాట్లాడటం బాగుంటుందా? వాళ్ళేమను కుంటారు?"

"ఏమనుకొంటారు? సత్యప్రియను పెళ్ళి చేసుకోటానికి సినిమా ఏక్టర్లు కూడా పెళ్ళి చూపులకు వచ్చారనుకొంటారు. తప్పేముంది-గొప్పేగా?"

"అతడు నీకన్నా నాకన్నా గొప్పవాడేం కాదు. సత్యా! నువ్వు డిగ్రీ పుచ్చుకున్నావు. నేను డాక్టరేట్ పుచ్చుకొన్నాను. కానీ అతడు డిగ్రీ పరీక్ష ఫెయిలయి వుద్యోగం ఏమీ చిక్కక, బ్రతుకు తెరువు కోసం సినిమాల్లో నటుడి వుద్యోగం సంపాదించుకొన్నాడు. నీకు నచ్చి పెళ్ళాడిన నాకన్నా, నిన్ను చూడటానికి వచ్చిన చాలా మందికన్నా అతని విశిష్టత ఏమిటి? నిన్ను చూడటానికి వచ్చిన వారిలో కొందరు ఆఫీసర్లు అయ్యారు. మరి కొందరు గొప్ప బిజినెస్ పీపుల్స్ అయ్యారు. నేను రచయితను. యూనివర్సిటీలో టీచర్‌గా ఎందరినో తీర్చిదిద్దుతున్న వాడిని"

"అయితే మాత్రం ఆఫీసర్లకు, డాక్టర్లకు, లెక్చరర్లకు, బిజినెస్

వాళ్ళకు-సినిమా వాళ్ళ కున్నంత పేరు వుందా? వాళ్ళయితే అందరికీ తెల్సు. మీరు ఎందరికి తెల్సు?"

"అంటే-వో వ్యక్తి విలువకు ప్రమాణం అతనికున్న గ్లామరే నంటావా? అలాగని అవిద్యా వంతులు అనుకోవటంలో అర్థ ముంది. కాని నువ్వు వో గ్రాడ్యు యేట్వి యూనివర్సిటీ లెక్చరర్ భార్యవి. గొప్ప బిజినెస్ నిపుణత కలిగివున్న కుటుంబంలో పుట్టిన దానివి. ఆ తాహతుకు తగ్గట్టుగా వుండొద్దా నీ అభిరుచులు, ఆలోచ నలు?"

"ఏమో! నా అభిరుచులు నావి. నా కవన్నీ తెలియవు." సత్య ప్రియ అంది.

"నువ్వొట్టి అమాయకురాలివి సత్యా! నీకింకా చాలా తెలియవు. ఫిజిక్స్‌లో అయస్కాంత తత్వాన్ని గురించి ఓ సూత్రాన్ని చదివే వుంటావు. గుర్తుందా? 'అన్ లైక్ పోల్స్ ఎట్రాక్ట్ ఈచ్ అదర్. లైక్ పోల్స్ రెపెల్.' అంటే 'విజాతి ధృవాలు ఆకర్షించు కొంటాయి. సజాతి ధృవాలు విక ర్షించుకొంటాయి' అని అర్థం. అలాగే చదువు, ధనము, వైవా హిక జీవితం, భద్రత, స్థిరత్వం వున్న నీలాంటివాళ్ళకు, వాటిల్లో కొన్ని వుండీ కొన్ని లేకా వెలిగే సినిమా వాళ్ళంటే ఆకర్షణ. వాళ్ళకు-ఇవన్నీ వున్న మనమంటే ఆకర్షణ. ఏం చేస్తాం?"

'గొప్ప!' అన్నట్లు మూతిని ముప్పై వంకరులుగా తిప్పింది సత్యప్రియ.

ఆ తర్వాత ఎప్పుడో ఓసారి మంచి మూడ్‌లో వుండగా శరత్‌తో అంది—

"డియర్! నువ్వింత అందంగా వుంటావుకదా! సినిమాల్లో హీరో వేషాల కోసం ఎందుకు ప్రయ త్నించకూడదు? నేను చెప్పానే అతను చూడు- విలన్‌గా నిము షంలో ఎంత పైకి వచ్చాడో! పోనీ సినిమాలకు కథలయినా ఎందుకు రాయకూడదు?"

ఆ తర్వాత భార్యను మార్చే ప్రయత్నాన్ని చేయలేదు శరత్ బాబు. సహించటం, సర్దుకుపోవటం వ్రతంగా స్వీకరించాడు.

*　*　*

సత్యప్రియ అభిమాన నటి ఆ రోజు యూనివర్సిటీలో జరిగే సాంస్కృతీ సభలకు వస్తోంది. శరత్‌బాబుతో పోరాడి సత్యప్రియ కూడా బయల్దేరింది.

ఆ నటి అసలు పేరేమిటో ఎవరికీ తెలియదు. సినిమా రంగం

లోకి దిగేముందు ఎవరో చేసిన నామకరణం మాత్రమే అందరి నోళ్ళల్లో నానుతోంది.

"అసలు మీరు సినిమాల్లోకి ఎలా వచ్చారు? మీ అసలు పేరే మిటి?" పాత ప్రశ్ననే ఆమెను కొత్తల్లో చాలామంది పత్రికల వాళ్ళు అడిగారు.

"నేను డాక్టరుని కావాలను కొన్నానండీ అసలు. కానీ భగ వంతుడు ఏక్టరిని చేసాడు. ప్రేక్షకు లంతా ఏ పేరునయితే అభిమాని స్తారో అదే నా అసలు పేరు." పాత సమాధానమే ఆమె కూడా ఇచ్చేది.

"డాక్టరు కావల్సిన మీరు ఏక్టర్ ఐనందుకు విచారిస్తున్నారా? సంతో షిస్తున్నారా?"

"డాక్టరయి వుంటే కొందరు రోగుల శరీరారోగ్యాన్ని మాత్రమే కుదర్చగలిగేదాన్నేమో! కానీ ఏక్టర్ని కావటంవల్ల చాలామంది హృద యాలకు టానిక్కులిస్తున్నానుగా! అందుకని సంతోషిస్తున్నాను."

సినిమా నటిగా ఆమె ఇప్పుడు చాలా ఎదిగింది. బోలెడంత సంపా దించినట్లు పేరు. అభిమాన సంఘాలు వెలిశాయి. ఎన్నో బిరుదులొచ్చాయి.

సినిమాల్లో చేరే ముందు జరి గిన నామకరణపు పేరు కూడా ఇవ్వాళ ఆమె మర్చిపోతోంది. ఆమెనంతా 'మహానటి' అనే అంటున్నారు. అలా అనటమే ఆమెకు కావల్సింది. ఆ పేరుతో పిలిస్తేనే ఆమెకు గర్వాంతో ఆనందం!

మహానటిని దూరంనుంచి చూడ టంతో తృప్తిపడ లేకపోయింది సత్యప్రియ. 'దగ్గరికెళ్ళి మాట్లాడాలి. ఎలా?'

ఆమె దృష్టిని ఒకతను ఆకర్షిం చాడు. అతని పేరు బాలచంద్ర. శరత్‌బాబు సహ లెక్చరర్. కార్య క్రమ నిర్వహణ అంతా అతనే అయినట్లు తిరుగుతున్నాడు. మహా నటి కూడా అతనినే మాటిమాటికీ సినిమా చూపులతో చూస్తోంది, పలకరిస్తోంది.

"ప్రోగ్రాం అయ్యాక మహా నటిని నేను కలుస్తాను."

"కలువు. కానీ ఎలా? జనం. చూస్తున్నావుగా?"

"బాలచంద్ర మీ ఫ్రెండేగా? ఆ మాత్రం చేయలేడా?"

కార్యక్రమం కాగానే మహానటి తన గదికి వెళ్ళింది. ఆమె దర్శనం కోసం జనం రోడ్డుమీద పడి గాపులు కాస్తున్నారు. పత్రికల వాళ్ళకి కూడా ఇంటర్వ్యూ ఇవ్వ

టానికి తిరస్కరించింది. పోలీసు బందోబస్తు!

ఒక్క బాలచంద్ర మాత్రమే ఆమె గదిలోకి వెళ్ళుతున్నాడు.

బాలచంద్ర సత్యప్రియను ఆమె గదిలోకి తీసుకెళ్ళాడు.

"మీ అభిమాని-మా ఫ్రెండ్ భార్య."

మహానటి సత్యప్రియ చెయ్యి పట్టుకొని కూర్చోపెట్టింది. ఐదు నిముషాలు ఆమె పొగడ్తలను వింది.

"మీరు పెళ్ళెప్పుడు చేసుకుంటారు?" చివరన ప్రశ్న వేసింది.

"మంచి సంబంధం చూచి పెట్టండి. మీరు చేసుకోమన్నప్పుడు చేసుకుంటాను."

"మహా నటి మీరు. మిమ్మల్ని మించిన మహానటులే చేసుకొంటారు."

మహానటి నవ్వింది. బాలచంద్ర వేపు చూచింది చిత్రంగా!

"నా పెళ్ళి మీరు లేకుండా జరగదులెండి. మొదటి ఆహ్వానపత్రిక మీకే పంపుతాను."

తన జన్మ చరితార్థమయినట్లుగా తృప్తిగా బయటికొచ్చింది సత్యప్రియ.

ఆ తర్వాత కొన్నాళ్ళకు మహానటి ఓ వర్ధమాన పిల్లనటుడిని పెళ్ళి చేసుకోబోతున్నట్లు పేపర్లో వార్తలొచ్చాయి.

"చూచారా! ఆ రోజు అయస్కాంత సూత్రాన్ని చెప్పేరు. కానీ మహానటి మరో నటుడినే చేసుకుంటోంది."

శరత్ బాబు నవ్వాడు.

"నువ్వొట్టి పిచ్చిదానివి సత్యా! తప్పని సరైతేతప్ప ఆమె సజాతి ధృవాన్ని పెళ్ళిచేసుకోదు. విజాతి ధృవంచేత ఆమె ఆకర్షించబడింది."

"అంటే-మిమ్మల్ని చేసుకొంటుందా?" చిరాకొచ్చి, కచ్చను-ఎగతాళిని మేళవించింది. శరత్ బాబు సమాధానం ఇవ్వకపోవటంతో మరింత రెచ్చిపోయింది. "ఎంచక్కని హీరోలు సినిమా ఫీల్డులో లేక-ఈ ముష్టి మేస్టర్‌ను అంత మహానటి వరించి చేసుకొంటుందండీ!"

బాలచంద్ర ఈ మధ్య శరత్ బాబు ఇంటికి రాకపోకలు ఎక్కువ చేశాడు.

"మీ అభిరుచి వేరు. మా వారి అభిరుచి వేరు. మీ ఇద్దరికీ ఏం మాటలుంటాయండీ- అంతంతసేపు రూమ్‌లో తలుపులు బిగించుకొని కూర్చుంటారు?"

"సినిమాల విషయమేనా మీర

నేది? నాకు అదొక్క అభిరుచే కాదు కదండీ! ఇంకా చాలా ఉన్నాయిగా? శరత్‌బాబుకు నాకు కామన్ ఇంటరెస్ట్సు చాలా ఉన్నాయి."

సత్యప్రియ మాత్రం ఏమాత్రం అవకాశం చిక్కినా బాలచంద్రతో సినిమా హస్కు వేసుకొనేది.

"మీకు తెల్సా? ఆ విలన్ వేషాలు వేస్తున్నాడే-అతను-సినిమా యాక్టరవుతాడని నేనసలు ఊహించనే లేదండీ!"

"వాడి మొహం ఏక్టరు. వాడేం ఏక్టరు? చూచారుగా- ఎంత త్వరగా పైకొచ్చాడో అంత త్వరగా క్రిందికి పడిపోతున్నాడు. సినిమాల్లో అదే చిత్రం! ఒక సినిమా 'హిట్' అయితే పైకి పాకుతాడు. కానీ ఫెయిలైతే కిందికి ఫుట్‌బాల్‌లా తన్నేస్తారు."

ఇదిలా వుండగా మహానటి ఓ స్టేట్‌మెంట్ ఇచ్చింది.

'తనకు పెళ్ళి చేసుకొనే ఆలోచన వున్న మాట నిజమే కాని, వరుడెవరయిందీ ఇంత వరకూ తను నిశ్చయించుకోలేదని, పత్రికలలో వార్తలు అబద్ధమనిన్నూ.'

మహానటి ఓ లెక్చరర్‌ని చేసుకోవాలనుకొంటుందన్న వార్తను కూడా ఓ పత్రిక ప్రకటించింది. కాదు-డాక్టరంది మరో పత్రిక.

మొత్తంమీద ఆమె పెళ్ళి ప్రజల సమస్య అయింది.

అభిమానులు-ఆమె ఎవర్ని పెళ్ళి చేసుకొంటే బాగుంటుందో సలహాలు ఇచ్చారు. అందరూ సినిమాలో వాళ్ళనే చేసుకోమన్నారు. లెక్చరర్లని, డాక్టర్లని చేసుకొనే స్థాయికి దిగవద్దని అన్నారు.

"మహానటి పెళ్ళి విషయంలో మీ అభిప్రాయమేమిటి? ఎవర్ని చేసుకొంటుందంటారు?"

"మీరేమనుకొంటున్నారు?"

"ఏ ప్రొడ్యూసరునో, డైరెక్టరునో, నటుడినో చేసేసుకొంటుందనుకొంటున్నా! లెక్చరర్లని, డాక్టర్లని, ఆఫీసర్లని చేసుకొనే కర్మ ఆమె కెందుకు!"

బాలచంద్ర బ్రీఫ్‌కేస్ తెరిచి ప్లాస్టిక్ కవరును తీసి ఆమె చేతికిచ్చాడు.

"ఇందులో ఉత్తరాలు చదివి నాకు తగు సలహా యివ్వండి. ప్లీజ్!" అంటూ వెళ్ళిపోయాడు.

* * *

"తెరపైన కన్పించేదంతా నటనే అనుకొన్నా, ఎందరో మగవాళ్ళ చేతుల్లో నలిగిన మనిషి. కులగోత్రాలు తెలియవు. జాతకం తెలియదు. చూడబోతే మీకన్నా

పెద్దదేమోనని కూడా అనుమానం. మేకప్ తుడిచేస్తే నిజరూపం ఎలా వుంటుందో కూడా తెలియదు. మీరా బాగా చదువుకొన్నవారు. ఉన్నత కుటుంబంలో నుంచి వచ్చారు. లక్షణంగా గౌరవప్రద మైన ఉపాధ్యాయ వృత్తిలో వున్నారు. ఏమీ లేని సినిమా వాళ్ళే అన్నన్ని గొప్పలు పోతూంటే, మీరెంత గొప్పగా ఫీల్ అవ్వాలి? దయచేసి సినిమానటిని పెళ్ళి చేసుకోవద్దు. మంచి గౌరవకుటుం బంలో పిల్లను. చదువుకొన్న పిల్లను చేసుకోమని నా సలహా. అంతే కాదండోయ్! నాలాగా 'సినిమా పిచ్చి' లేని పిల్లను ఏరి చేసుకోండి. మీ కెందుకు? పెళ్ళి చూపులకు నన్ను తీసు కెళ్ళండి. నేను ఇంటర్వ్యూచేసి మంచి పిల్లను సెలక్టు చేస్తాగా?"

బాలచంద్ర మాట్లాడలేదు. శరత్ బాబే ఆశ్చర్యపోతూ, "సత్యా!" అన్నాడు.

"మీరన్నట్లు నేను ఒట్టి అమా యకురాలినే కాదండీ-తెలివితక్కువ దాన్ని కూడా. బాలచంద్రగారిని పెళ్ళిచేసుకోవాలని వలలు విసిరిన మహానటి నాకన్నా తెలివిగలది. ఎందుకంటే ఆమె అస్థిరత్వం వైపు నుంచిస్థిరత్వం వైపుకు, భ్రమనుంచి సత్యం వైపుకు, బంధనాల నుంచి స్వేచ్ఛవైపుకు, మాయా గౌరవం నుంచి నిత్యమైన గౌరవం వైపుకు రావాలని ఆరాటపడుతోంది. నేనో వెర్రిదాన్ని. ఆమె కావాలనుకుం టున్న స్థానంలో కూర్చొని ఆమె స్థానంచేత ఆకర్షింపబడ్డాను. మీ ఆకర్షణ సిద్ధాంతం నా విషయంలో నిజమండీ! నన్ను క్షమించండీ!"

* * *

మరో నెల తర్వాత మహానటి పత్రికా ప్రకటన చేసింది—

"అభిమానుల ఒత్తిడి వల్ల వివాహం చేసుకోవాలని ఆలోచిం చిన మాట వాస్తవమే. కానీ పెళ్ళి కన్నా 'కళాసేవ'లోనే పరమా నందం వుందన్నది నా స్థిర విశ్వాసం. అందుచేత ప్రస్తుతానికి పెళ్ళి ఆలోచన విరమించుకొని కళాసేవకే పూర్తిగా అంకిత మవు తున్నాను."

ఆ వార్త చదివి సత్యప్రియ చిత్రంగా నవ్వింది.

"నిజ జీవితంలో నటన అంటే ఇదే కదండీ?" శరత్ బాబుతో అంది.

'అవును-ఇదే. కానీ ఆ నటనా ఒక్కోసారి అవసరమేమో ప్రియా!' అని మనసులో అను కొని శరత్ బాబు ప్రేమగా ఆమెను దగ్గర తీసుకొన్నాడు.

"మాయా మేయ జగంబె నిత్య మని సంభావించి...." ఎవరో రేడియోలో పాడుతున్నారు. *